## ఎంత భాగ్యమే తల్లి

*రాగం : మలహరి        తాళం : తిశ్రగతి*

**పల్లవి:**

ఎంత భాగ్యమే తల్లి ఆ శివునిది
నిన్ను పొందగలిగె నమ్మ తపసు ఫలమిది

**చరణం :**

అల్లి బిల్లి పలుక గలుగు వారలంతా
అంటినారు గాదె వాణి నెంతో కొంతా
బ్రహ్మ కింతె భాగ్యమేమి చెపుదు మింక
అమ్మ శివుని దొక్కనిదే భాగ్యమంతా ...1

కాసు కంట జూడగలుగు వారలంతా
కలిగినారు కాదె లక్ష్మి నెంతో కొంతా
హరికి యింతె భాగ్యమేమి చెపుదు మింక
అమ్మ శివుని దొక్కనిదే భాగ్యమంతా ...2

నహుషు డొకడు కబురుపంపి పిలిచినంత
ఇంకె గాదె శచి గొప్పలు ఎంతో కొంతా
ఇంద్రు భాగ్య మింతె యేమి చెపుదుమింక
అమ్మ శివుని దొక్కనిదే భాగ్యమంతా ...3

మాటకందవమ్మ నీవు మనసుకందవు
వేదతతులకైన నీవు పట్టు చిక్కవు
ఎవ్వరమ్మ నిన్ను అందగలిగినారు
శివుడొక్కడె నిన్నొడిసి పట్టినాడు ...4

లోకమ్మున విడివడని జంట వున్నదా
మీ జంటకు ఎపుడైనా యెడము ఉన్నదా
అవునమ్మా ఈ భాగ్యము శివుడె నోచెను
సచిదనంద భావాద్వయ పదము దోచెను...5